# యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తజనం



యాదగిరిగుట్టలో స్వామివారికి నిత్యపూజలు చేస్తున్న అర్చకులు

- న్యూఇయర్ తొలిరోజుతో భారీగా తరలివచ్చిన భక్తులు
- వైభవోపేతంగా స్వామి, అమ్మవార్ల నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, జనవరి 1 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. సోమవారం సెలవుదినంతోపాటు ఆంగ్ల నూతన సంవత్సరం తొలిరోజు కావడంతో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దేవస్థానంతోపాటు ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఎటుచూసినా భక్తులే దర్శమిచ్చారు. ఆలయ తిరుమాఢవీధులు, క్యూలైన్లు, క్యూ కాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, సత్యనారాయణ వ్రత మండపాలు భక్తులతో కిటికిటలాడాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ క్యూలైన్‌లో నిలబడ్డారు. కొండకింద, కొండపైన పార్కింగ్ వాహనాలతో నిండిపోయింది. స్వామివారి ధర్మదర్శనానికి 5 గంటలు, ప్రత్యేక దర్శనానికి 4 గంటల సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. స్వామి, అమ్మవార్లకు నిత్యారాధనలు శాస్త్రోక్తంగా జరిగాయి. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖమండపంలో వారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులు సువర్ణపుష్పార్చనలు జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవ జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు జరిపారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు నిర్వహించారు. రాత్రి ప్రధానాలయ ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున అర్చకులు వేద మంత్రాలు పటిస్తూ అమ్మవారికి తిరుప్పావై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ధనుర్మాన విశిష్టతను భక్తులకు వివరించారు. గోదాదేవి, రంగనాయకుడిపై రచించిన పాశురాలను పఠిస్తూ అర్చకులు మార్గళి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా కొనసాగాయి.



రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దంపతులకు ఆశీర్వచనం చేస్తున్న యాదగిరిగుట్ట ఆలయ అర్చక బృందం

సుమారు 56 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.76,78,268 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

### స్వామిని దర్శించుకున్న ప్రముఖులు..

లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆలయ సంప్రదాయరీతిలో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు. స్వామివారిని మాజీ గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ దర్శించుకున్నారు.

### గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్‌కు స్వామివారి ఆశీస్సులు..

నూతన సంవత్సరం పురస్కరించుకుని లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రధానార్చక బృందం, అధికారులు గవర్నర్ దంపతులు, సీఎం, మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో తమిళిసై సౌందరరాజన్, సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ప్రధానార్చక బృందం చతుర్వేద ఆశీర్వచనం చేశారు. స్వామివారి పవిత్రమాలను ధరింపజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ కలిసి గవర్నర్, సీఎం, మంత్రికి స్వామివారి మహాప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న అర్చకులు



క్యూ కాంప్లెక్స్‌లో భక్తుల సందడి



కొండ పైన వాహనాల రద్దీ

## కేటీఆర్‌కు న్యూ ఇయర్ విషెస్..









2024 నూతన సంవత్సరం పురస్కరించుకొని హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సోమవారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి న్యూ ఇయర్ విషెస్ తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ ఉన్నారు.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం

- గంజాయి రవాణా నివారణకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్
- నల్లగొండ నూతన ఎస్పీగా చందనా దీప్తి బాధ్యతల స్వీకరణ



నల్లగొండ సిటీ, జనవరి 1 : నల్లగొండ జిల్లా కొత్త ఎస్పీగా చందనా దీప్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని సోమవారం పోలీస్ హెడ్ క్వాటర్‌లో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి సిబ్బంది, ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను అరికడుతామన్నారు. గంజాయి మాదక ద్రవ్యాల వల్ల ఎన్నో కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని, దాని నిర్మూళనకు స్పెషల్ ట్రాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో నేషనల్ హైవేలు ఎక్కువ ఉండడంతో ప్రమాదాలు ఎక్కువ చోటుచేసుకుంటున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దొంగతనాల నివారణకు పెద్ద సంఖ్యలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, ఇండ్లు, షాపుల యజమానులు సొంతంగా సీసీ కెమెరాలు పెట్టుకోవడం మంచిదని సూచించారు. సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకుంటే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నివారణకు ప్రత్యేక ట్రాస్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎప్పటికప్పుడు పోలీసు సిబ్బందితో సమీక్షించి జిల్లాలో నేరాల శాతాన్ని తగ్గించేందుకు కృషి చేస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం అందరి సహాయ సహకారాలు అవసరమని తెలిపారు. ఎస్పీగా చందనా దీప్తి నియామకం కావడంతో పోలీస్ అధికారులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

# నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి విజేత నల్లగొండ

- బాలికల విభాగంలో రన్నరప్‌గా నిలిచిన జిల్లా జట్టు

నందికొండ, జనవరి 1 : నందికొండ హిల్‌కాలనీలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. ట్రెడిషినల్ రాష్ట్ర స్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో నల్లగొండ జట్టు విజేతగా నిలిచి ప్రథమ బహుమతి గెలుచుకుంది. నారాయణపేట జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలికల విభాగంలో మేడ్చల్ జట్టు ప్రథమ, నల్లగొండ జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి. సోమవారం నిర్వహించిన ఫాస్ట్ ఫైవ్ ఫైనల్ పోటీల్లో బాలుర విభాగంలో నారాయణపేట జట్టు విజేతగా, మహబూబ్‌నగర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలికల విభాగంలో నల్లగొండ జట్టు విజయం సాధించగా.. మేడ్చల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది.

అనంతరం విజేతలకు జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ బహుమతుల ప్రదానం చేశారు. రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విక్రమాదిత్యరెడ్డి, ఉపాధ్యక్షులు సారత్‌ఖాన్, మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఖాజాఖాన్, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, పీఈటీ అనూరాధ, పాఠశాల హెచ్‌ఎం అన్నమ్మ, ఆర్గనైజింగ్ సభ్యులు పాల్గొన్నారు.